వాగులూ వదలని కూటమి నేతలు


ఆక్రమణ స్థలంలో నిర్మించిన ప్రహరీ


నిర్మించిన ఇల్లు..

- లక్షల విలువైన వాగు పోరంబోకు, శ్మశాన స్థలం ఆక్రమణ
- ఆక్రమణలు తొలగించాల్సిందేనంటున్న తహసీల్దార్

దర్శి (కురిచేడు): ఆక్రమణకు కాదేదీ అనర్హం.. అని నిరూపించారు కూటమి నాయకులు. సర్వే నంబరు 932లోని వాగు పోరంబోకు, శ్మశాన స్థలం కొన్నేళ్లు ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఆ స్థలం పక్కన వెంచర్ వేయడంతో స్థల విలువలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. దీంతో అధికారం అండగా ఉండటం తోడైంది వెంటనే ఆ స్థలంపై కన్నేసి రాత్రికి రాత్రే ఆక్రమణకు తెరలేపారు. ప్రహరీ నిర్మించి రేకుల షెడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఇంత వరకు ఆక్రమించిన వారిపై చర్యలు లేకపోవడంతో తాము సైతం అన్న చందంగా ఖాళీగా ఉన్న స్థలాన్ని ఆక్రమణ చేశారు. వాగులు, వంకలు ఆక్రమణ జరిగితే తుఫాన్‌లు వచ్చిన సమయంలో వరదలకు ముంపునకు గురవుతాయని నాటి పెద్దలు వాగులకు విశాలంగా స్థలం వదిలారు. విజయవాడలో ఇటీవల ముంపునకు గురై కొన్ని వందల కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ఈ సంఘటన కళ్లెదుటే కనిపించినా ఆక్రమణల పర్వం ఆగలేదు. ఆక్రమణలు ఆరంభంలోనే వాటిని అధికారులు అడ్డుకట్ట వేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని చూసిన వారు పేర్కొంటున్నారు. ఈ విషయం తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌కు తెలియడంతో సంఘటన స్థలానికి వెళ్లి ఆక్రమణదారులతో మాట్లాడారు. వాగు పోరంబోకు, శ్మశాన వాటిక స్థలం ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని, ఆక్రమణలను తొలగిస్తామని హెచ్చరించారు. ఆక్రమణదారులందరిపై చర్యలు తీసుకుని ఖాళీ చేయిస్తారా? లేక ఇప్పుడు ఆక్రమణదారులపైనే చర్యలు తీసుకుంటారా? లేక అధికార పార్టీ నాయకుల ఆదేశాలకు తలొగ్గి కంటి తుడుపు చర్యలతో సరిపెడతారా? అని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.


ఆక్రమణ స్థలం వద్ద తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ


వీరప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పుల్లలచెరువు: ఇటీవల రహదారి ప్రమాదంలో గాయపడి నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త కంచర్ల వీరప్రసాద్‌ను గురువారం యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వీరప్రసాద్ ఆరోగ్య పరిస్థితి ఆయన వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

పశువైద్యశాల ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న జేడీ బేబీరాణి

దర్శి (కురిచేడు): మండలంలోని బొట్లపాలెం పశు వైద్యశాలను పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబీరాణి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పశుగణనను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బందికి సూచనలు చేశారు. వైద్యశాల పరిధిలోని గ్రామాల్లో పశువులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. పశు వైద్యాధికారి బసవయ్య, ఆహోలు శివారెడ్డి, సరోజిని, రామంజి, విజయ్‌పాల్ పాల్గొన్నారు.

మూడు గడ్డివాములు దగ్ధం


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కురిచేడు: మండలంలోని పడమర నాయుడుపాలెంలో గురువారం మూడు గడ్డివాములు దగ్ధమై రూ.80 వేల ఆస్తి నష్టం జరిగింది. గ్రామానికి చెందిన జి.బండపోలయ్య, నాసరమ్మ, హనుమంతులకు చెందిన గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. మూగజీవాల నోటికాడ గడ్డి అగ్నికి ఆహుతి కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడ్డివాములు ఎలా దగ్ధమయ్యాయో మిస్టరీగా ఉంది. దర్శి అగ్నిమాపక కేంద్రం అధికారి సీహెచ్ జాలయ్య తన సిబ్బందితో మంటలు అదుపు చేశారు .

వైభవంగా త్రిపురాంతకేశ్వర స్వామి కల్యాణం


త్రిపురాంతకేశ్వర స్వామి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

త్రిపురాంతకం: శ్రీ పార్వతితీ త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య వైభవంగా జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా కల్యాణ మహోత్సవాన్ని బుధవారం రాత్రి నుంచి నిర్వహించారు. శివరాత్రి జాగారం సందర్భంగా స్వామివారికి మహాన్యాసపూర్వక, ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి 11.30 గంటలకు విశేష ద్రవ్యాలతో లింగోద్భవకాల రుద్రాభిషేకాలతో ప్రారంభమై రాత్రి 12.30 గంటలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుష్ప మండపంలో స్వామి కల్యాణోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనులార తిలకించారు. పండితులు విశ్వనాథ శాస్త్రి, ప్రసాద శర్మలు పార్వతి త్రిపురాంబ, త్రిపురాంతకేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవ తంతును వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి పర్యవేక్షణలో కల్యాణమహోత్సవ ఏర్పాట్లు చేశారు.

నీటి బిల్లులు ఇప్పించాలి


కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న శ్రీనివాసరెడ్డి

పుల్లలచెరువు: నీటి ఎద్దడి ఉన్న దృష్ట్యా గతంలో నీటి సరఫరా చేసిన ట్యాంకర్లకు బిల్లులు ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి గురువారం వినతిపత్రం అందచేశారు. 2022 మార్చి నుంచి 2023 మార్చి వరకు ఎంబుక్‌లు ఇచ్చారని, వాటికి బిల్లులు రాలేదని, వాటితో పాటు 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు గ్రామాల్లో నీటి సరఫరా చేశామని, వాటికీ ఇంతవరకు శాంక్షన్ చేయలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గారపెంటలో గిరిజనులకు నిర్మిస్తున్న 90 భవనాలకు పూడిక మట్టిని తోలుకునేందుకు అటవీశాఖ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని సర్పంచ్ శ్రీనుతో పాటు శ్రీనివాసరెడ్డి కలిసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

శ్రీశైలం నుంచి భక్తుల తిరుగు ప్రయాణం


రెడ్ల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానం


కాపు సంఘం ఆధ్వర్యంలో..


ఇస్కాన్ ఆధ్వర్యంలో..

- భక్తులు, యాత్రికులకు అన్నదానం

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల పుణ్యక్షేత్రం నుంచి భక్తులు స్వస్థలాలకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో యాత్రికులు, శివభక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మండల కేంద్రంలో పలు ధార్మిక సంస్థలు అన్నదానంతో తమ సేవా కార్యక్రమాలు ముమ్మరం చేశాయి. ఈ సందర్భంగా యాత్రికులకు భోజన వసతి కల్పించారు. మండల రెడ్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమంలో యర్రగొండపాలెం బట్టు సుధాకరరెడ్డి, గంటా రమణారెడ్డి, గుంటూరు గాలిరెడ్డి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, యక్కంటి మల్లారెడ్డి, లాలూనాయక్ పాల్గొన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాపు, బలి ఒంటరి తెగల సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమంలో యామా దాసయ్య, కేతి మురళి, గుర్రాల ప్రసాద్, కమ్మ వెంకటేశ్వర్లు (పండు), రాంశెట్టి కృష్ణ, వీరిశెట్టి ఫణీంద్ర పాల్గొన్నారు. ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. దర్శి మండలం తానం చింతల గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో గణపతి చెక్‌పోస్టు వద్ద చలివేంద్రంతో పాటు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

సాయిబాబా మందిరంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక హారతులు ఇచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. శివరాత్రి పండగ సందర్భంగా దాతల సాయంతో ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే కాలినడక శివ స్వాములు, భక్తుల కోసం అన్నదానం చేశారు.


మందిరంలో భక్తులకు అన్నదానం

టీ స్టాల్ వద్ద ఎమ్మెల్యే తాటిపర్తి సందడి


టీ స్టాల్ వద్ద అభిమానులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ గురువారం ఉదయం స్థానిక టీ స్టాల్ వద్ద సందడి చేశారు. వాకింగ్‌కు వెళ్లిన ఆయన స్థానిక పుల్లలచెరువు రోడ్డులోని బృందావనం గార్డెన్స్‌లో యువతతో కాసేపు క్రికెట్ ఆడి వారిని ఉత్తేజపరిచారు. తిరిగి వచ్చే సమయంలో బస్టాండ్ సెంటర్‌లో ఉన్న కాశింపీరా టీ స్టాల్ వద్ద ఏర్పాటు చేసిన బల్లాలపై కూర్చొని టీ ఆర్డర్ ఇచ్చారు. ఆ సమయంలో ఆయన్ను గమనించిన ప్రజలు, అభిమానులు, నాయకులు గుంపులుగా చేరి ఆయనతో మాటామంతి కలిపారు. ఎటువంటి పోలీసు రక్షణ లేకుండా ఎమ్మెల్యే జనంలో తిరగాడాన్ని అందరూ అభినందించారు.

మెరుగైన జీవనోపాధికి ఉపాధి పనులు


గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పెద్దారవీడు: మెరుగైన జీవనోపాధి కోసం ఉపాధి హామీ పనులు వినియోగించుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. మండలంలో బద్వీడు పంచాయతీ చెంచుగుడేన్ని ఆమె గురువారం సాయంత్రం సందర్శించారు. స్థానికంగా ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఫారం పాండ్ తవ్వకం పనులను పరిశీలించారు. గిరిజనులు మాట్లాడుతూ గతంలో తహసీల్దార్ 22 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఇళ్ల స్థలాలను కొంత మంది దళారులు అక్రమించుకున్నారని, పొలాల సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ సదస్సులో అర్జీలు ఇచ్చామని, నేటికీ సంబంధించిన అధికారులు సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో తాగునీటి కోసం పెద్ద ట్యాంక్ ఏర్పాటు చేయాలని, పెద్దారవీడు చెరువు కట్ట నుంచి బద్వీడు గ్రామం వరకు వెళ్లే మట్టి రోడ్డుకు తారు రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. చెంచుగూడేనికి మీరు వస్తున్నారని తెలుసుకొని మండల అధికారులు వచ్చారే కానీ కార్యాలయం వద్దకు వెళ్లి సమస్యలు విన్నవించుకుంటే పట్టించుకునే నాథుడే లేరని వాపోయారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం పూట స్థానికంగా మిరప తోటల పనులు వెళ్లి సాయంత్రం పూట ఉపాధి పనులు చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్‌కుమార్, ఏపీడీ నిర్మలాదేవి, ఇన్‌చార్జి ఏపీఓ మంత్రునాయక్ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి


తాళ్లూరు: మాట్లాడుతున్న ఏవో ప్రసాద్‌రావు

ముండ్లమూరు (కురిచేడు): మండలంలో రబీ పంటలు సాగు చేసిన రైతులు మార్చి 3వ తేదీలోపు ఈ-పంటగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి తెలిపారు. మండలంలోని పులిపాడు, ఉల్లగల్లు గ్రామాల్లోని శనగ పంటను ఆయన తన సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మార్చి 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి సామాజిక తనిఖీ కోసం రబీపంట నమోదు జాబితాలు ప్రదర్శిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన రైతు విశిష్ట సంఖ్యలో అందరూ నమోదు చేసుకోవాలని కోరారు. పసుపుగల్లు పీఏసీఎస్‌లో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. రైతులు సరైన తేమ శాతంలో ఉన్న కందులను కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లి విక్రయించుకోవచ్చని తెలిపారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

తాళ్లూరు: పంట రకం, నాణ్యత, దిగుబడులు, డిమాండ్, అంతర్జాతీయ ధరలు, ఎగుమతులు, దిగుమతుల ఆధారంగా ధరలు మారుతూ ఉంటాయని, వీటిని అంచనా వేసుకుని రైతులు అవగాహన కలిగి అమ్ముకునేందుకు ప్రయత్నించాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు గురువారం అన్నారు. ప్రస్తుతం మార్కెట్లో అంచనా ధరలు క్వింటాలకు వరి సాధారణ రకం రూ.2,320, ఏ గ్రేడ్ రకం రూ.2675, మొక్కజొన్న రూ.2460, జొన్న రూ.3120, వేరుశనగ రూ.6760, పత్తి రూ. 7250, మిరప సాధారణ రకం రూ.13500, ప్రత్యేక రకాలు రూ.17,200, పసుపు కొమ్ములు రూ.13,200, కందులు రూ.8,680 చొప్పున అంచనా వేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. వీఏఏలు నాగమల్లేశ్వరి, వీఏహెచ్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు


భరతనాట్యం వేస్తున్న చిన్నారులు

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు శ్రీగంగా పర్వత వర్ధిని సోమేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పండగ సందర్భంగా బుధవారం అర్ధరాత్రి వరకు చిన్నారులు నృత్యాలు ప్రదర్శించారు. శివాలయం ఆవరణలో చిన్నారులు భరతనాట్యం, జానపద, భక్తి పాటలకు వేసిన నృత్య రూపకాలు భక్తులను ఎంతగానో అలరించాయి. మహిళలు చేసిన లింగాష్టకం నృత్య రూపకం ఆకట్టుకుంది. కార్యక్రమం అనంతరం గ్రామ పెద్దలచే చిన్నారులకు బహుమతులు అందజేసి డ్యాన్స్ మాస్టర్ శివ శంకర్‌ను శాలువాతో సన్మానించారు. పోలంరెడ్డి సుబ్బారెడ్డి, సన్నపురెడ్డి అంజిరెడ్డి, పద్మావతి, శివశంకర్ డ్యాన్స్ మాస్టర్, ఆలయ పూజారులు వెంకటకృష్ణారావు, రమణయ్య, వాసు, గ్రామ పెద్దలు, శివాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఫారం పాండ్స్‌పై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


పిడికిటివానిపల్లిలో ఫారం పాండ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

పుల్లలచెరువు: గ్రామాల్లోని రైతుల పొలాల్లో నిర్మించే ఫారం పాండ్స్‌పై రైతులకు అవగాహన కల్పించి వాటిని ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. గురువారం ఆమె మండలంలోని పిడికిటివానిపల్లిలో ఏర్పాటు చేసిన ఫారం పాండ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. వీటిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం తప్పని సరిగా అందజేయాలన్నారు. వీటిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. వీటిని ఉపాధి సిబ్బంది పర్యవేక్షిస్తూ టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. వీటిపై అశ్రద్ధ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, పీడీ జోసఫ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

పీ-4 సర్వేను చురుగ్గా నిర్వహించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


పీ-4 సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పుల్లలచెరువు: గ్రామాల్లో నిర్వహిస్తున్న పీ-4 సర్వేను చురుగ్గా నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. గురువారం మండలంలోని చాపలమడుగులో జరుగుతున్న పీ-4 సర్వేను ఆమె పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో సర్వేను సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా చేయాలన్నారు. గ్రామంలోని సమగ్ర వివరాలు సేకరించాలని సూచించారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని, రైతులను ఇబ్బంది పెట్టకుండా జాగ్రత్తగా సర్వే చేయాలన్నారు. గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన గోకుల్ షెడ్లను పరిశీలించి డబ్బులు వచ్చాయా..అని ప్రశ్నించారు. అనంతరం వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య, పారిశుధ్య నిర్వహణ చర్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూ పీ, సీ షెడ్‌ను పరిశీలించి అది పూర్తి స్థాయిలో వినియోగంలో లేకపోవడంతో కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో వినియోగంలోకి తీసుకొచ్చి తనకు నివేదిక పంపాలని కలెక్టర్‌ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ఆశ్రద్ధ చేయకుండా విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. వీటిపై మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, సీఈవో చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకరరావు, సర్వేశాఖ సహాయ సంచాలకులు గౌస్‌బాషాతో పాటు మండల అధికారులు పాల్గొన్నారు.

నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి


మంచినీటి సరఫరా చేసే విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్‌కు చిన్నదోర్నాల వాసుల విజ్ఞప్తి

పెద్దదోర్నాల: నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని చిన్నదోర్నాల వాసులు గురువారం మండలంలో పర్యటించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా ఎదుట వాపోయారు. గ్రామంలో నీటి సమస్య అధికంగా ఉందని కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గురువారం మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌తో కలిసి ఆమె దోర్నాల మండలంలో పర్యటించారు. చిన్నదోర్నాల గ్రామస్తులు తమకు తీవ్ర నీటి ఇబ్బందులు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన కలెక్టర్ నీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్యాంకర్ల ద్వారా మంచినీటిని పంపిణీ చేస్తున్న తీరును ఆమె స్వయంగా పరిశీలించారు. చిన్నదోర్నాలలో మంచినీటి పథకాలు ఎండిపోయాయని, గ్రామంలో 2 వేల మంది జనాభా ఉన్నారని అధికారులు తెలిపారు. దీంతో నాలుగు ఏజెన్సీల ద్వారా 20 మంచి నీటి ట్యాంకులు రవాణా చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. స్థానికంగా జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులతో మంచి నీటి పైపులు వేయడంలో జాప్యం జరుగుతోందని అధికారులు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ రహదారి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతకు ముందు కలెక్టర్ చిన్నగుడిపాడు, దోర్నాలలో పర్యటించి రీ సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకర్‌రావు, ఏఈ భ్రమరాంబికాదేవి పాల్గొన్నారు.

6,714 మంది రైతులకు పీఎం కిసాన్ నిధులు


దొనకొండ: పొగాకు పంటలో పొలం బడి

దొనకొండ: మండలంలోని 18 పంచాయతీల్లో 6,714 మంది రైతు కుటుంబాలకు 19వ విడత పీఎం కిసాన్ రూ.2 వేల ప్రకారం రూ.1.35 కోట్లు రైతుల బ్యాంక్ అకౌంట్లలో జమైనట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా యర్రబాలెం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంకా పీఎం కిసాన్ నిధులు రానివారు ఆధార్ కార్డు లింక్ బ్యాంక్ ఖాతా చెక్ చేసుకోవాలని తెలిపారు. రైతుల ప్రయోజనార్థం రైతుల జాబితాలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకుల వద్ద ఉంచినట్లు తెలిపారు. అనంతరం యర్రబాలెంలో రైతులు సాగు చేసిన పొగాకు, మిరప పంటలను పరిశీలించారు. ఆయన వెంట రైతులు, సిబ్బంది రవితేజ, కమల ఉన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు ప్రకాశం జిల్లా, గిద్దలూరు మండలం, తమ్మళ్లపల్లి గ్రామము, డోర్ నెం. 1-54 కాపురస్తుడు **కొండా రామిరెడ్డి** కుమారుడు **చిన్న నర్సిరెడ్డి** వలన సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయు పబ్లిక్ నోటీసు.

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని 07-09-2022వ తేదిన రూ.7,39,000/-లుకు ప్రకాశం జిల్లా, మార్కాపురం పట్టణము, డోర్ నెం.1-203- ఇ-156-బి, పవర్ ఆఫీసు వెనుక కాపురస్తుడు **షేక్ మహబూబ్** కుమారుడు **ఖాశింసా** గారి తరుపున మార్కాపురం స.రి.ఆలో 1వ పుస్తకం 4256/2018వ నెంబరుగా వ్రాయించియిచ్చిన స్థిరాస్తి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా పవర్ పొందిన ఏజెంటు **కందుల కవిత, భర్త రమణారెడ్డి,** రంగారెడ్డిపల్లి గ్రామము, రాచర్ల మండలం, ప్రకాశం జిల్లా గారు వ్రాయించి యిచ్చిన స్థిరాస్తి విక్రయ దస్తావేజు ద్వారా విక్రయించుకొని నా క్లయింటు సర్వ సంపూర్ణ హక్కులతో నేటికి నా క్లయింటు స్వాధీన అనుభవములో ఉన్నది. అయితే ఇటీవల షెడ్యూలు ఆస్తిని కొందరు అక్రమముగా కాజేయవలెయునని దురుద్దేశంతో దస్తావేజులు సృష్టించుటకు ప్రయత్నము చేయుచున్నట్లు నా క్లయింటుకు తెలియవచ్చినది. కావున క్రింది షెడ్యూలు ఆస్తిని గూర్చి ఎవరైనను ఎలాంటి లావాదేవీలు గానీ, క్రయ-విక్రయములు గానీ, ఆయతములు గానీ, తనఖా పత్రములు గానీ, విక్రయ ఖరారులు గానీ, విక్రయ దస్తావేజులు గానీ జరుపుటకు హక్కు, అధికారం లేదు. అట్లు ఎవరైనా సృష్టించిన యెడల, అట్టి వారిపై నా క్లయింటు చట్ట రీత్యా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

ఆస్తి షెడ్యూలు వివరములు: ప్రకాశం జిల్లా, మార్కాపురం రి.డి.& సబ్.డి., మార్కాపురం మున్సిపాలిటీకి చెందిన మార్కాపురం గ్రామ ఇలాకా డోర్ నెం. 1-214-జి-3 నకు సమీపమున సదరు ఖాశింసా విక్రయాధికారము కలిగి నా క్లయింటుకు విక్రయించి స్వాధీనపర్చిన ఆస్తికి నెంబరు వారి వివరము -

మార్కాపురం మున్సిపాలిటి ఇలాకా సర్వేంట్స్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ రిజిస్టరు నెం.209 లో మార్కాపురం గ్రామ సర్వే నెంబరు. 404/1 లో ప్లాట్ నెం. 37 దాఖలా 340 చ॥గ॥ల పైకి 142 చదరపు గజములు గల ఖాళీ స్థలముకు **హద్దులు. తూర్పు:** ప్లాట్ నెం.34 దాఖలా స్థలం. **పడమర:** 30 అడుగులు వెడల్పు గల రోడ్డు. **ఉత్తరం:** ప్లాట్ నెం. 38 దాఖలా స్థలం. **దక్షిణం:** ప్లాట్ నెం.37 లో మిగులు స్థలం.

ఈ హద్దులకు లోనైన తూ॥ పే॥ 65 అడుగులు. ఉ॥ ద॥ 19.65 అడుగులు కొలతలు గల 142 చదరపు గజములు గల స్థలము విక్రయం.

ఇట్లు: **కె.అచ్చిరెడ్డి,** అడ్వకేటు, మార్కాపురం, సెల్ నెం. 9440924920.